క్లుప్తంగా

13న జాతీయ లోక్ అదాలత్



ఎస్సై శివాజీ

దెందులూరు: ఈ నెల 13న భీమడోలు కోర్టులో జాతీయ లోక్అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఎస్సై రాచమల్లు శివాజీ తెలిపారు. సోమవారం దెందులూరు పోలీస్ స్టేషన్లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాజీ యోగ్యమైన అన్ని క్రిమినల్, సివిల్, కుటుంబ వివాదాలు, చిట్‌ఫండ్, టెలిఫోన్ బకాయిలు, ఇంటి పన్నుల వివాదాల కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. లోక్అదాలత్ ద్వారా రాజీ చేసుకోబడిన సివిల్ కేసులకు కోర్టు ఫీజులు చెల్లించినవారికి తిరిగి కోర్టు చెల్లిస్తుందన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని డబ్బు సమయాన్ని ఆదాచేసుకోవాలని ఎస్సై శివాజీ సూచించారు. 13న జరిగే లోక్ అదాలత్ కార్యక్రమంపై కక్షిదారులకు అవగాహన కల్పించాలని ఆయన సిబ్బందికి సూచించారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం



సరస్వతీదేవి చిత్ర పటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

భీమడోలు: వివక్ష లేని సమాజ స్థాపనకు విద్య దోహద పడుతుందని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో సోమవారం అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ అధిక అక్షరాస్యత గల రాష్ట్రాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకోవాలన్న సంకల్పంతో ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయన్నారు. ముందుగా చదువుల తల్లి సరస్వతీదేవి చిత్రపటాలకు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, కె.శ్రీనివాసరావు, జి.బంగారుపాప, మండే సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

తెరుచుకున్న ఆలయాలు



పాలాభిషేక పూజలు చేస్తున్న అర్చకుడు

భీమడోలు: సంపూర్ణ చంద్ర గ్రహణం ముగిసిన నేపథ్యంలో సోమవారం ఉదయం ప్రముఖ దేవాలయాలు తెరుచుకున్నాయి. ఆదివారం రాత్రి ఆకాశంలో చంద్ర గ్రహణం కనువిందు చేసింది. దీంతో భీమడోలు మండల వ్యాప్తంగా ఉన్న ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భీమడోలు, పోలసానిపల్లి, గుండుగొలను, పూళ్ల, అంబర్‌పేట గ్రామాల్లో వేంచేసియున్న శివాలయాల్లో తెల్లవారు జాము నుంచి భక్తులు స్వామి వార్లను దర్శించుకునేందుకు బారులు తీరారు. తొలుత ఆలయాల్లో సంప్రోక్షణ పూజలు నిర్వహించిన పూజారులు భక్తుల దర్శనానికి అనుమతి ఇచ్చారు. భీమడోలులోని శ్రీపార్వతీ సమేత భీమేశ్వర స్వామి వారి ఆలయంలో అర్చకుడు కాళ్లకూరి ఉమా శంకర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆర్వోబీ నిర్మాణానికి సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

ఉంగుటూరు: ఉంగుటూరు, నాచుగుంటలలో నిర్మించే ఆర్వోబీలకు ప్రజలు సహకరించాలని తహసీల్దార్ పూర్ణచంద్ర ప్రసాద్ కోరారు. సోమవారం ఉంగుటూరు, నాచుగుంటల్లో ఆర్వోబీలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యాక రైల్వే గేటును శాశ్వతంగా మూసి వేస్తారని వెల్లడించారు. రైల్వే గేటు వలన ప్రజలు పడిన కష్టాలు గట్టెక్కనున్నాయన్నారు. సమావేశంలో సర్పంచి బండారు సింధు, బొడ్డు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెదపాడు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పెదపాడు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కృష్ణా జిల్లా మల్లిబంధానికి చెందిన కాకాని నాగేశ్వరరావు ఎరువులు తీసుకొచ్చేందుకు హనుమాన్ జంక్షన్ వెళ్లి తిరిగి వస్తుండగా సీతారామపురం గ్రామంలోని శ్రీనివాస్ హేచరీస్ ఫ్యాక్టరీ వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి వచ్చే గూడ్స్ వ్యాన్ డ్రైవర్ వేగంగా హారన్ కొట్టకుండా నిర్లక్ష్యంగా నడుపుతూ వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలైన నాగేశ్వరరావును ఏలూరులోని కృష్ణా హాస్పటల్‌కు తరలించారు. రెండు కాళ్లు విరిగినట్లు డాక్టర్ ధ్రువీకరించడంతో పెదపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై కట్టా శారదా సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎలక్కొట్టుడు..



పంటను పాడు చేస్తున్న మూషికాలను చూపుతున్న రైతులు



ఎలుకలను పట్టే బుట్టలు



పొలంలో బుట్టలు పెట్టడంతో దొరికిన ఎలుకలు

- పొట్ట దశలో వరిని నాశనం చేస్తున్న ఎలుకలు
- నివారించేందుకు పాట్లు పడుతున్న రైతులు

పెదవేగి: వ్యవసాయ సాగులో మూషికాలు రైతును ఆర్థికంగా కొంత మేర ఇబ్బంది పెడుతున్నాయి. దీంతో రైతులకు ఎలుకలతో తిప్పలు తప్పడం లేదు. నియోజకవర్గ వ్యాప్తంగా వరి పంటలోనే ఎలుకలు ఎక్కువగా ప్రభావం చూపుతున్నాయి. ప్రస్తుతం ఎలుకలు ఈనిక దశలో ఉన్నాయి. ఈ రబీలో రైతులు బుట్టలతో ఎలుకలను పట్టిస్తున్నారు. ఎలుకల బుట్టలు పెట్టే వారికి డిమాండ్ పెరిగింది. ఎకరాకు 35–45 ఎలుకలు దొరుకుతున్నాయి. ఎలుకలను పట్టేందుకు బుట్టలు పెట్టే చోట గుర్తుకు గుచ్చే పెగ్‌లను వీరే తయారు చేస్తారు. ఎలుకలను పట్టే ప్రత్యేక నేర్పరులు ఉండి మండలం పాండువ్వ నుంచి పెదవేగి మండలంలోని సూర్యారావుపేట వచ్చారు. పంట గుబురుగా, దట్టంగా పెరిగిన చోట ఎలుకలు స్థావరాలు ఏర్పాటు చేసుకోవటానికి అనుకూలంగా ఉంటుందని ఎలుకలు పట్టేవారు దగరపు భాస్కరరావు, చెక్కా పెద్దిరాజు, గారపాటి ప్రసాద్‌లు తెలిపారు. గింజలు తయారయ్యాక వాటిని నాశనం చేసి, బొరియల్లోకి తీసుకెళతాయని చెబుతున్నారు. ఎలుకలు తినేది తక్కువ, పాడు చేసేది ఎక్కువని, రోజుకు ఎకరాకు 35 నుంచి 45 వరకు ఎలుకలను పడుతున్నామన్నారు. ఎలుకకు రూ.10 చొప్పున వస్తుందని చెబుతున్నారు. రోజుకు ఒక్కొక్కరికీ రూ.500 నుంచి రూ.800 వరకు గిట్టుబాటు అవుతుందని, రైతులు వేసిన పంట చేతికి వచ్చే సమయానికి ఎలుకల బెడద వలన తమకు పని దొరుకుతుందని, సాగు లేనప్పుడు తమ జీవనం అస్తవ్యస్తంగా ఉంటుందన్నారు. దెందులూరులో స్థానిక ఎస్టీ ప్రాంతానికి చెందిన కొంత మంది దీనిని జీవనోపాధిగా చేసుకుని చుట్టు ప్రక్కల గ్రామాల్లో ఎలుకల బెడద నియంత్రించేందుకు తద్వారా కుటుంబాలను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

ఎగ్జిబిషన్‌ను సందర్శించిన విద్యార్థులు



విజయవాడలో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న నారాయణపురం డిగ్రీ కాలేజీ విద్యార్థినులు

ఉంగుటూరు: విజయవాడ సిద్ధార్థ కళాశాలలో ఇందిరా గాంధీ సెంటర్ ఫర్ ఈమాక్ రీసెర్చ్ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను నారాయణపురం అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సందర్శించారు. అక్కడ ప్రదర్శించిన ప్రయోగాలను తిలకించారు. భారత దేశానికి న్యూక్లియర్ రియాక్టర్స్, ప్రయోగాలు, పనీటీరు, తదితర అంశాలను తెలుసుకున్నారు. కార్యక్రామనికి సమనవ్వయ కర్తలుగా అధ్యాపకులు డాక్టర్ బి.వెంకటేష్‌రెడ్డి, డాక్టర్ పి.బాబూరావు, టి.గ్రాబియేలు వ్యవహరించారు. ఎగ్జిబిషన్ తిలకించడం వలన ఎంతో ఉపయోగపడిందని అనేక విషయాలు తెలుసుకున్నామని విద్యార్థులు పేర్కొన్నారు. విద్యార్థులకు ప్రిన్సిపాల్ డి.రెడ్డియ్య అకడమిక్ కో–ఆర్డినేటర్ డాక్టర్ కొండా రవి, అధ్యాపకులు నిర్మల జ్యోతి అభినందనలు తెలిపారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

భీమడోలు: ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.శిరీష అన్నారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ సంస్థ, ఆదర్శ రూరల్ హెల్త్ అండ్ ఎకనమిక్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో పోలసానిపల్లి, గుండుగొలను, భీమడోలు ఉన్నత పాఠశాలల్లో ఎయిడ్స్, హెచ్‌ఐవీ, మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. పోలసానిపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో బాలికలు, వివిధ శాఖల సిబ్బంది ర్యాలీ, ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా కె.శిరీషా, భీమడోలు ఎంఈవో 2 అయినపర్తి భాస్కర్‌కుమార్ మాట్లాడుతూ సమాజాన్ని పట్టి పీడిస్తున్న ఎయిడ్స్ మహమ్మారీని పాలద్రోలేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ సింహాద్రి, సిబ్బంది బి.రామకృష్ణ, రమాదేవి, సచివాలయం, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

అధిక ఎరువుతో పంటకు నష్టం



కొత్తపల్లిలో రైతులతో మాట్లాడుతున్న ఏవో ప్రసాద్

గణపవరం: వరిపైరుకు అనవసరంగా ఎరువులు వాడడం వలన పంటతో పాటు రైతులకూ నష్టమని వ్యవసాయ అధికారుల సిఫార్సు మేరకు మాత్రమే ఎరువులు వాడాలని మండల వ్యవసాయ అధికారి ఆర్ఎస్ ప్రసాద్ అన్నారు. ముందస్తు పిచికారీలు చేయకూడదన్నారు. సోమవారం కొత్తపల్లిలో ఆయన రైతులతో మాట్లాడారు. ఇటీవలి భారీ వర్షాలకు పైరు పూర్తిగా దెబ్బతిని రైతులు నష్టపోయారని, ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోకుంటే రైతులు కోలుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టం అంచనా వేస్తున్నామని, జాబితాను త్వరలోనే రైతుసేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తామని తెలిపారు. ఎక్కడైనా ఎరువులు బ్లాక్‌లో విక్రయిస్తే రైతులు తమ దృష్టికి తీసుకురావాలని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అక్రమనిల్వలపై కఠిన చర్యలు

ఎరువులు అక్రమంగా నిల్వ చేసినా, అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే లైసెన్సులు కూడా రద్దు చేస్తామని గణపవరం మండల వ్యవసాయ అధికారి ఆర్ఎస్ ప్రసాద్ హెచ్చరించారు. సోమవారం ఆయన గణపవరం, కొమ్మర, వల్లూరు గ్రామాలలోని సహకార సొసైటీలు, ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు.

'అన్నదాత పోరు'ను విజయవంతం చేయండి

మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి





ఉంగుటూరులో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: యూరియా బ్లాక్ మార్కెట్‌పై మంగళవారం ఏలూరులో జరిగే అన్నదాత పోరును స్వచ్ఛందంగా రైతులు, వైఎస్సార్ సీపీ అన్ని విభాగాల శ్రేణులు విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. సోమవారం ఏలూరు అశోక్ నగర్‌లోని ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధినేత ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం 9 గంటలకు దెందులూరు నియోజవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయానికి చేరుకోవాలన్నారు. అనంతరం ఏలూరు ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తామన్నారు. దేశానికి అన్నం పెట్టి రైతుకు జరుగుతున్న అన్యాయం ఇబ్బందుల పరిష్కారం కోసం చేస్తున్న అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అబ్బయ్యచౌదరి అన్నారు.

అన్నదాత పోరు విజయవంతం చేయాలి

భీమడోలు: ఏలూరులో ఈ నెల 9వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటలకు జరిగే అన్నదాత పోరును విజయవంతం చేయాలని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు రావిపాటి సత్య శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు రామకుర్తి నాగేశ్వరరావు కోరారు. భీమడోలులో సోమవారం రాత్రి ఓ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. కూటమి పాలనలో రైతులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు అన్నదాత పోరును చేపట్టామన్నారు. రైతన్నలకు బాసటగా నిర్వహిస్తున్న అన్నదాత పోరుకు రైతులు భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలన్నారు. ఏలూరు ఫైర్ సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వద్ద భారీ ర్యాలీ నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఉంగుటూరు: యూరియా ఇబ్బందులపై నేడు ఏలూరులో జరిగే ఆందోళన కార్యక్రమానికి రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మరడమంగరావు కోరారు. అన్నదాత పోరు పేరుతో నిర్వహించే శాంతియుత నిరసనలకు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే వాసుబాబు పిలుపు మేరకు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు పుప్పాలగోపి, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు దొంతంశెట్టి సత్యానారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు పెనుగొండ బాలకృష్ణ, మంద జయలక్ష్మి, వెంకటేశ్వరరావు, గౌతు శ్రీనివాసరావు, తమ్మిన శ్రీనివాసరావు, పుత్సకాయల విష్ణుమూర్తి, గంటా లక్ష్మణరావు, సందక రాంబాబు, చింతల కిషోర్, తాడిగడప వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎంపీటీసీల గౌరవ వేతనాలు విడుదల చేయాలి



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శి

భీమడోలు: ఎంపీటీసీలకు రావాల్సిన గౌరవ వేతనాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని భీమడోలు ఎంపీటీసీ–1, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, పూళ్ల ఎంపీటీసీ గంటా శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు సోమవారం ఏలూరులో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో జేసీ ధాత్రి రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎంపీటీసీలకు ఇవ్వాల్సిన 26 నెలల గౌరవ వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. తాము వైఎస్సార్ సీపీ హయాంలో ఎంపీటీసీలుగా ఎన్నిక కాగా, నెలకు రూ.3 వేల చొప్పున వేతనం కొన్ని నెలల పాటు అందించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ఒక్క రూపాయి విడుదల చేయలేదన్నారు. పలుసార్లు పీజీఆర్ఎస్‌లో వినతి పత్రాలు సమర్పించినా నేటికీ గౌరవ వేతనాలు మంజూరు కాలేదని అధికారుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు.

మేరీమాత స్ఫూర్తితో మెలగాలి



ప్రార్థనలు చేస్తున్న ఏలూరు పీఠాధిపతి డాక్టర్ పొలిమేర జయరావు

దెందులూరు: మేరీమాత స్ఫూర్తితో ఇతరుల కోసం ప్రార్థనలు చేయాలని ఆర్‌సీఎం ఏలూరు పీఠాధిపతి డాక్టర్ పొలిమేర జయరావు అన్నారు. సోమవారం రాత్రి వేగవరం ఆర్‌సీఎం చర్చి ఫాదర్ ఎల్.మోజస్ ఆధ్వర్యంలో మేరీమాత ఉత్సవాలు పీఠాధిపతి ప్రారంభించారు. తొలుత వేగవరం టవర్ వద్ద మేరీమాతకు పూలమాలలు వేసి దీపాలంకరణ చేశారు. అనంతరం ఆర్‌సీఎం చర్చిలో ఆయన దివ్య బలి పూజ అర్పించారు.

అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయండి



సర్పంచ్‌ల వర్క్‌షాపులో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీలక్ష్మి

గణపవరం: గ్రామ పంచాయతీలు అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని గణపవరం ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి సూచించారు. సోమవారం గణపవరం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులకు పంచాయతీ పురోగతి ఇండెక్స్(పీఏఐ)పై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీలు వనరుల లభ్యతను బట్టి అవసరమైన మౌలిక వసతులకు సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, ఆర్‌పీ దైబాల రామాంజనేయులు అభివృద్ధి ప్రణాళికల తయారీపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు ముత్యాల వేణు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

దళితులపై దాడి దుర్మార్గం



మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తనగల శేఖర్

దెందులూరు: కైకలూరు నియోజకవర్గం దానగూడెంలో దళితులపై దాడి చేయడం దుర్మార్గమని, నిందితులను కఠినంగా శిక్షించాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తనగల శేఖర్ కోరారు. సోమవారం చల్లపల్లిలో ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకులు మద్దాల తిరుపతిరావు, శ్రీనివాసరావులతో కలిసి మాట్లాడారు. సమాజంలో అన్నదమ్ముల వలె కలిసిమెలసి జీవిస్తున్నప్పటికీ దళితులపై దాడులు చేయడం దుర్మార్గమన్నారు. ఈ దాడి సంఘటనకు సంబంధించి కోర్టులు స్వచ్ఛందంగా స్పందించి విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడి సంఘటనపై ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు తెలియజేశామన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు తిరుపతిరావు మాట్లాడుతూ బాధితులకు, వారి కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించాలన్నారు.

హాస్టళ్ల తనిఖీ



హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ సుమతి

దెందులూరు: హాస్టళ్లలో పూర్తిస్థాయి నాణ్యత పాటించాలని రికార్డులు సక్రమంగా నిర్వహించాలని తహసీల్దార్ బి.సుమతి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం కొవ్వలి, సింగవరం బీసీ హాస్టళ్లను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనం, విద్యుత్, తాగునీరు, బాత్‌రూమ్‌లు, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులు, సిబ్బందితో వేర్వేరుగా సమావేశం నిర్వహించి నాణ్యత సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ హేమమాలిని ఉన్నారు.

11 గ్రామాల్లో రీసర్వే ప్రారంభం



రీసర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

దెందులూరు: మండలంలోని 11 గ్రామాల్లో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రీసర్వే ప్రారంభించామని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ రవిచంద్ర ఆధ్వర్యంలో 11 గ్రామాల్లో ఉన్న 6000 ఎకరాల ప్రభుత్వ భూమి సరిహద్దులను నిర్ణయిస్తామన్నారు. మండల సర్వేయర్ గ్రామాల సర్వేయర్లు, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు విధులు నిర్వహిస్తున్నారన్నారు. సోమవారం గ్రామాల్లో నిర్వహించిన రీసర్వేను డీటీ రవిచంద్రతో కలిసి పరిశీలించారు. సరిహద్దులు నిర్ణయించే ప్రక్రియలో రైతుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా ముందుగానే నోటీసు ఇవ్వాలన్నారు.

31 మందికి వైద్య పరీక్షలు

దెందులూరు: ఎటువంటి అనారోగ్య లక్షణాలు కనబడినా ఆలస్యం చేయకుండా సమీప ప్రభుత్వ వైద్యశాలలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని గోపన్నపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాకేష్ అన్నారు. సోమవారం జోగన్నపాలెం వెల్‌నెస్ సెంటర్‌లో 31 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆహారపు అలవాట్లు, వ్యాయామం అవసరమన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యులు

వ్యాయామ ఉపాధ్యాయులకు అభినందనలు



జెడ్పీ బాలుర హైస్కూల్‌లో వ్యాయామ ఉపాధ్యాయులను అభినందిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల జంగారెడ్డిగూడెం నందు కొయ్యలగూడెం జోన్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో స్కూల్ గేమ్స్ మండల స్థాయి క్రీడాల నిర్వహణ, డివిజన్ స్థాయి క్రీడా నిర్వహణ గురించి ఉపాధ్యాయులు చర్చించారు. వ్యాయామ ఉపాధ్యాయులుగా పని చేస్తూ ఉన్నత స్థానాలను చేరుకున్న పేరం రవీంద్రనాథ్, కొవ్వాసు జగదీశ్వరి, బి.జాన్సన్, పీఎస్ సుధాకర్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కొయ్యలగూడెం వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడిగా జి.హనుమంతరావు, సెక్రటరీగా ఎం.కామేశ్వరి, కోశాధికారిగా శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికైె నట్లు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు

నేడు సర్వసభ్య సమావేశం

ఉంగుటూరు: నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి తెలిపారు. ఈ సమావేశంలో ఆయా గ్రామాల సమస్యలు చర్చించనున్నట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని ఎంపీపీ కోరారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు తప్పనిసరిగా హాజరు కావాలని ఆమె కోరారు.

పింఛను ఇప్పించాలని వినతి



బుట్టాయగూడెం ఎంపీడీఓ కార్యాలయ ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: అర్హత ఉన్నా తమకు పింఛను మంజూరు చేయడం లేదని మండలంలోని రెడ్డిగణపవరంనకు చెందిన మహిళలు సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన శివుడు సావిత్రి మాట్లాడుతూ తన భర్త వెంకటస్వామి చనిపోయి ఆరేళ్లయిందని తనకు ఇంతవరకూ పింఛను మంజూరు కాలేదని చెప్పారు. అదేవిధంగా భర్తలు చనిపోయిన కొలుకూరి వెంకటరత్నం, దంపనబోయిన అన్నపూర్ణ సైతం తమకు ఏ ఆధారం లేదని, పింఛను మంజూరు కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేవీపీఎస్ నాయకులు అందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడుతూ పింఛను మంజూరు చేసి వెంటనే వారిని ఆదుకోవాలని కోరారు. అనంతరం వినతిపత్రాన్ని ఎంపీడీఓ ఏఓ బేబీ సరోజినికి అందజేశారు.

లయన్స్ ఆహార వితరణ



పేదలకు ఆహార పొట్లాలు అందజేస్తున్న లయన్స్ సభ్యులు

గణపవరం: గణపవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నిరుపేదలు, బిక్షగాళ్లు, వలస జీవులకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ప్రతి వారం పేదలకు ఆహారం పంపిణీ చేస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు వెల్లంకి నరేష్ తెలిపారు. కార్యక్రమంలో లయన్ సభ్యులు కిలారి రవిబాబు, కె.సత్యనారాయణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలపై ధర్నా

చింతలపూడి: కరెంట్ కష్టాలు తీర్చాలని కోరుతూ నామవరం గ్రామస్తులు సోమవారం రాత్రి సబ్ స్టేషన్ ముందు ధర్నా చేశారు. గత 20 రోజులుగా గ్రామంలో విద్యుత్ సరఫరా సరిగా ఉండటం లేదని గ్రామస్తులు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు వచ్చిందని అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా శాశ్వత చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు బోడ రమేష్, బోడ తేజ ఆరోపించారు. కరెంట్ లేక దోమలు, ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు.